క్లుప్తంగా

ధ్రువీకరణ పత్రాల పంపిణీ



కోస్గి: ఎస్‌బీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ నిర్వహించిన ఉపాధిశిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఆర్‌డీఓ గోపాల్‌నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై అభ్యర్థులకు పత్రాలు అందజేశారు. పాల ఉత్పత్తి మరియు వర్మి కంపోస్ట్ తయారీపై పదిరోజులుగా శిక్షణ ఇచ్చామని, శిక్షణ పూర్తిచేసిన వారికి పత్రాలు అందజేసినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కాళప్పతోపాటు డీపీఎం తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ ట్రాక్టర్ల పట్టివేత

కోస్గి: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసునమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధిలోని బిజ్జారం వాగు నుంచి శుక్రవారం తెల్లవారు జామున అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై తమ సిబ్బందితో కలిసి పోతిరెడ్డిపల్లి రోడ్డులో ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బిజ్జారం గ్రామానికి చెందిన ట్రాక్టర్లుగా గుర్తించి సంబంధిత యజమానులపై కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా ఆరాధన మహోత్సవం



ఊట్కూరు: మండలంలోని శివరామ దీక్షిత అప్పిరెడ్డిపల్లి గురుపీఠాధిపతి శ్రీ భక్తానంద మాదవరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ప్రత్యేక పూజలు చేశారు. గురువులు, భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దత్తయ్య రాజయోగి, సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, లక్ష్మారెడ్డి, భక్తబృందం తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు గాలిపటాల పంపిణీ



కోస్గి: భారతీయ సంస్కృతిసంప్రదాయం ప్రపంచానికే ఆదర్శమని ఆధ్యాత్మికవేత్త రఘోత్తం ఆర్యా అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక శ్రీ లక్ష్మీవేంకటేశ్వర శివసాయి అయ్యప్ప ఆలయాల ప్రాంగణంలో సంక్రాంతి సందర్భంగా చిన్నారులకు గాలిపటాలను పంపిణీ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు హైందవ సంస్కృతిని వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బస్వరాజ్, యాదవ సంఘం నాయకులు వెంకటయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా రెజ్లింగ్ పోటీలకు ఎంపిక



ధన్వాడ: చెన్నైలో ఈ నెల 19నుంచి 30వరకు జరిగే ఖేలో ఇండియా రెజ్లింగ్ పోటీలకు మండలంలోని కేజీబీవీ ఇంటర్ విద్యార్థి నాగలక్ష్మి ఎంపికైనట్లు శుక్రవారం ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్ లైన్ పనులు ప్రారంభం

మరికల్: మండలంలోని తీలేర్‌స్టేజీ నుంచి గ్రామం వరకు నూతన విద్యుత్ లైన్ పనులను శుక్రవారం సర్పంచ్ రేవతమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ స్టేజీ నుంచి కిలో మీటర్ల వరకు రోడ్డు పక్కన 25విద్యుత్ స్తంభాలను పాతి లైట్లు ఏర్పాటు చేయడానికి గ్రామ పంచాయతీ నిధులకింద విద్యుత్ శాఖకు రూ. 3లక్షల డీడీలు కట్టినట్లు తెలిపారు. రోడ్డుకు ఇరువైపుల లైట్ల వేసేందుకే ప్రత్యేక లైన్‌కు ఏర్పాటు చేశామన్నారు. లైన్‌మెన్ మధుసూదన్‌గౌడ్, రాజు, భజరప్ప, రవి, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.





మక్తల్‌లో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



మద్దూర్‌లో ..

ఆదర్శం.. వివేకానందుడి జీవితం



నారాయణపేటలో ఎమ్మెల్యేతో కలిసి నివాళులర్పిస్తున్న కమిటీ సభ్యులు

నారాయణపేట రూరల్ : స్వామివివేకానంద జయంతిని పేటపట్టణం, మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ పార్క్‌లో వివేకానంద విగ్రహ నిర్మాణ కమిటీ సేవా సమితి, భావ సమైక్య వేదిక, పీఆర్‌టీయూ, తపస్ ఉపాధ్యాయ సంఘాలు, పీఈటీల అసోసియేషన్, బీజేపీ పార్టీ, ఏబీవీపీ విద్యార్థి సంఘం, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమంలో నక్క కిష్టప్ప, శ్రీనివాస్‌గౌడ్, రాజేష్‌కుమార్, రతంగపాండురెడ్డి, నాగురావునామాజీ, కుర్మన్న పాల్గొన్నారు.

మక్తల్: స్వామి వివేకానంద జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయా గ్రామాల్లో జరిగిన వివేకానంద జయంతిలో వారు వేర్వేరుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వివేకానంద చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యువతలో చైతన్యం నింపి, యువతకు విజయాన్ని చేకూర్చే గొప్ప సూక్తులను అందించిన స్వామివివేకానంద అందరికి ఆదర్శప్రాయమని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, అంబాదాస్‌రావు, మాజీ ఎంపీపీ కొండయ్య, రాజుల ఆశిరెడ్డి, కౌన్సిలర్ అనంపల్లి కొండయ్య, జిల్లా కార్యదర్శి నాగప్ప, అంజిరెడ్డి, కర్నిస్వామి, సర్పంచ్ నర్సింహులు, ఎంపీటీసీ పారిజాత, మంజునాథ్, మహేస్‌సాగర్‌పాల్గొన్నారు.

కోస్గి: యువత స్వామి వివేకానందుడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సామాజిక సేవా సమితి రాష్ట్ర ప్రచారక్ కృష్ణస్వామి సూచించారు. స్వామివివేకానంద జయంతిని పురస్కరించుకొని శుక్రవారం బాహర్‌పేట వివేకానంద చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. అనంతరం వివేకానంద విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్, తపస్ నాయకులు నర్సింహులు, మల్లేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మద్దూర్: మండల పరిధిలోని నిడ్జింతలో స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి దేశ అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌కుమార్, శేఖర్‌రెడ్డి, కాశీనాథ్, అంజి, జంగిరెడ్డి, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎల్బీనగర్, బిజ్వార్, మల్లేపల్లి తదితర గ్రామాల్లో వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మల్లేపల్లిలో స్వామివివేకానంద యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాణిక్యమ్మ, మహేష్‌గౌడ్, లక్ష్మీనర్సింహ, కృష్ణయ్యగౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

మాగనూర్: యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని వర్కూర్ సర్పంచ్ నిర్మలమ్మ, వైస్ఎంపీపీ తిప్పయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వర్కూర్‌లో పంచాయతీ ఆవరణలో స్వామివివేకానంద జయంతిని ఘనంగా నిర్వాహించారు. ఈ సందర్భంగా వారు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మల్‌రెడ్డి, నర్సింహులు, తాయప్ప, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: స్వామి వివేకానంద జీవితం దేశ ప్రజలకు ఆదర్శప్రాయమని కున్సి సర్పంచ్ శంకరమ్మఆంజనేయులుగౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కున్సిలో స్వామివేవికాజయంతని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యుడు రాంచంద్ర, మాజీ సర్పంచ్ సోమశేఖర్‌గౌడ్, నల్లె నర్సప్ప, సిద్ధప్ప, రాంచందర్ పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వామివివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రాపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సుదర్శన్, విష్ణువర్ధన్‌రెడ్డి, రవి, బాలరాజ్, నవీన్, శ్రవణ్, ఉదయ్ పాల్గొన్నారు.

దామరగిద్ద: స్వామి వివేకానంద జీవితాన్ని నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని సేవాసమితి సభ్యులు రఘు, వెంకట్రాములు, సర్పంచ్ చంద్ర, రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభ్యులు జయసింహా, నర్సింహులు, కృష్ణ, సదానందం పాల్గొన్నారు.

నర్వ: మండలంలోని ఆయాగ్రామాల్లో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దకడ్మూర్, యాంకిలో ఆయన విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శశిరేఖజగన్‌మోహన్‌రెడ్డి, విండో వైస్ చైర్మన్ లక్ష్మన్న, మధు, ఆనంద్, రవి, శ్రీధర్‌చారి, నాగరాజుగౌడ్, చాంధపాషా పాల్గొన్నారు.



కోస్గిలో



దామరగిద్దలో..



ఊట్కూరులో..



మాగనూర్‌లో..

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో స్నేహితులు, గురువులు

మద్దూర్: కొత్తపల్లి మండల పరిధిలోని నిడ్జింతలో జెడ్పీఉన్నత పాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 2002–03 బ్యాచ్‌కి చెందిన పదోతరగతి చదువుకున్న విద్యార్థులు మరోమారు కలుసుకొని గురువులను సన్మానించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన స్నేహితులు కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు.

శబరికి తరలిన అయ్యప్పమాలధారులు



ఇరుముడితో శబరి దర్శనానికి వెళ్తున్న మాలధారణ చేసిన చిన్నారి

నారాయణపేట రూరల్ : పట్టణం, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు అయ్యప్ప మాలధారులు శుక్రవారం శబరిమలకు తరలివెళ్లారు. 41రోజులపాటు దీక్షను పూర్తిచేసి అయ్యప్ప సన్నిధానంలో మాలా విరమణకు బయలుదేరారు. ఈ మేరకు యాద్గిర్‌రోడ్డులోని ఆలయంలో స్వామివారి మూల విరాట్‌కు అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం గురుస్వాముల ఆధ్వర్యంలో శరణుఘోషల మధ్య ఇరుముడి కట్టి, అన్నదానం చేసి ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో నాగరాజు, కిశోర్, ఉమాపతి, అంజి, మహేష్, శ్రీధర్, వేణుగోపాల్, కృష్ణ పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ చేపట్టాలి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత పంపిణీ చేయాల్సిన గొర్రెల యూనిట్లపై దృష్టి సారించాలని కోరుతూ గొర్రెకాపరుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. 2019లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రెండోవిడత గొర్రెల పంపిణీపై నిర్ణయం తీసుకుని లబ్ధిదారులతో డీడీలు కట్టించుకున్నారని గుర్తుచేశారు. మూడు సంవత్సరాలు దాటినా ఇప్పటి వరకు గొర్రెలు పంపిణీ చేయలేదని, అప్పులు తీసుకొచ్చి ప్రభుత్వానికి డబ్బులు కట్టి రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వెంటనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకుని పంపిణీకి ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటయ్య, రాజు, చెన్నప్ప, మల్లప్ప, కృష్ణయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

యువత ఆర్థికంగా రాణించాలి

ఆత్మకూర్: కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి ముద్ర యోజన పథకంలో భాగంగా రుణాలు పొంది వ్యాపారులు, నిరుద్యోగులు ఆర్థికంగా రాణించాలని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ మహ్మద్ అబ్బాస్ అలీ, ఫీల్డ్ ఆఫీసర్ మదన్‌మోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్ కార్యాలయం ఆవరణలో మూడో రోజు ముద్ర రుణ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. రుణం కావాల్సిన వారు ముద్ర రుణ దరఖాస్తు పత్రం, ఆధార్, పాన్‌కార్డు, ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పత్రం, వ్యాపార అనుమతి లేదా నమోదుపత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, వార్షిక ఆదాయ పన్ను రిటర్న్ పత్రాలను తీసుకురావాలని సూచించారు. రుణ సౌకర్యానికి ఎలువంటి ప్రభుత్వ ఉద్యోగ జామీను, ఆస్తి తనఖా అవసరం లేదని స్పష్టం చేశారు.

బస్సుసౌకర్యం కల్పించాలి



ఊట్కూరు: మండలంలోని ఓబులాపూర్ గ్రామానికి బస్సుసౌకర్యం కల్పించాలని శుక్రవారం పేట బస్సుడిపో మేనేజర్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఊట్కూరు, ఓబులాపూర్, పగిడిమారి మీదుగా నారాయణపేటకు బస్సును నడిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, అంజప్ప, గోవిందు, బాలప్ప, రాఘవేందర్‌గౌడ్, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన నాయకులు



కోస్గి: సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం గుండుమాల్ మండలానికి చెందిన పలువురు నాయకులు కలిశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో రేవంత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో మాజీ సర్పంచ్ సురేష్‌రెడ్డితోపాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



మాగనూర్: మండల పరిధిలోని నేరడగం మఠం పీఠాధిపతి శ్రీ సిద్ధలింగమహాస్వామి వారు నూతన క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం స్వామివివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పి ంచారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ స్వామివివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నేరడగం ఎంపీటీసీ ఎల్లారెడ్డి, నాయకులు శివరాజ్‌పాటిల్, నాగరాజు, కృష్ణయ్య, గురుప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షతల పంపిణీ



తిర్మలాపూర్‌లో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు



మరికల్‌లో అక్షతలను అందజేస్తున్న గ్రామస్తులు

నారాయణపేట రూరల్: మండలంలోని లక్ష్మీపూర్, తిర్మలాపూర్, అభంగాపూర్, ఎక్లాస్‌పూర్ తదితర గ్రామాల్లో అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షతలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. నేటి తరానికి రామాయణాన్ని తెలియజేయాలని, పాఠ్యపుస్తకాల్లో పొందుపర్చాలన్నారు. ఈ నెల 22 వరకు అక్షతలను ఆలయ సన్నిధిలో ఉంచాలని, ఆ తర్వాత తలపై చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్దలు పాల్గొన్నారు.

మరికల్: అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను మండలంలోని మాధవరంలో శుక్రవారం విశ్వహిందు, భజరంగదళ్, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. వార్డుల వారీగా టీములను ఎంపికచేసి ఇంటింటికీ అక్షతలు చేరేలా చర్యలు తీసుకున్నారు. అయోధ్య అక్షతలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఇంటి సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ యశోద

కృష్ణా: ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలులో భాగంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ కొనసాగుతుందని ఎంపీడీఓ యశోద అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలనలో మొత్తం 8568 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తుల్లో పొందుపరిచిన అంశాలన్నింటినీ ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా పొందుపరుస్తున్నామని, మీసేవ నిర్వాహకుల సహరిస్తున్నారని పేర్కొన్నారు. మండల ప్రత్యేక అధికారి డీఆర్‌డీఏ అంజయ్య, ఎంపీఓ రామన్న, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న నామాజీ



దామరగిద్దలో..

నారాయణపేట రూరల్: క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతతో పాటు ఆత్మస్థైర్యం పెరుగుతుందని బీజేపీ రాష్ట్ర నాయకులు నాగరావు నామాజీ అన్నారు. పట్టణంలోని సహస్త్రార్జున్ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రీడాపోటీలను నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ధూల్‌పేట, మడి ప్రాంతాలకు చెందిన యువత పెద్ద సంఖ్యలో హాజరై క్రికెట్, ఇతర ఆటాపోటీలను ఉత్సాహంగా ఆడుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చదువుతో పాటు అన్ని రంగాల్లో యువత రాణించాలన్నారు. నాగురావు, నారాయణరావు, శంకర్, మహేష్, శ్రీనివాస్, నందునామాజీ పాల్గొన్నారు.

దామరగిద్ద: క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కల్గుతాయని సర్పంచ్ చంద్రం, పాఠశాల చైర్మన్ శివకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని మల్‌రెడ్డిపల్లిలో సంక్రాంతి పండగ ఉత్సవాల్లో భాగంగా స్వామివివేకానందుడి జయంతి సందర్భంగా స్థానిక పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ తన తల్లి చిన్నమణెమ్మ జ్ఞానపకార్థం స్థానిక యువతకు కబడ్డీ క్రీడాపోటీలను ప్రారంభించారు. ఉపసర్పంచ్ సవితసాయిలు, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, పురుమళ్లు, హన్మంతు, లాలప్ప, మహిపాల్, రవీందర్‌రెడ్డి, మహేష్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా కర్తవ్యబోధ్ దివస్



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ

నారాయణపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్‌వీఎస్ కళాశాలలో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కర్తవ్య బోధ్‌దివస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ.. యువత సెల్‌ఫోన్‌లకు బానిస కావొద్దని, పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేయొద్దన్నారు. దేశ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలని, యువత దేశరక్షణకు కంకణ బద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సురేష్, రషీద్, శేషమ్మ, భగవంత్‌రెడ్డి, చంద్రకాంత్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



ఊట్కూరులో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

ఊట్కూరు: మండలంలోని సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఎస్ఎస్‌కె సమాజ్, ఎల్బీనగర్ హనుమాన్ ఆలయ యువక మండలి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళలు పోటాపోటీగా రంగురంగుల ముగ్గులు వేశారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అశోక్ చౌదరి, కృష్ణయ్యగౌడ్, వెంకటేష్, రఘు పాల్గొన్నారు.

వేడుకగా హిందూ వాహిని ఆటలపోటీలు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

కోస్గి: వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా హిందూ వాహిని మండల శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటపోటీలు నిర్వహించారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీల్లో పలు పాఠశాలలు, కళాశాలల బాలబాలికలు పాల్గొని తమ ప్రతిభ చాటారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. వాలీబాల్ పోటీలో బాలుర విభాగంలో ఐటీఐ విద్యార్థులు గెలుపొందారు. బాలికల విభాగంలో గుండుమాల్ విద్యార్థులు మొదటి స్థానం, సర్జఖాన్‌పేట విద్యార్థులు రెండోస్థానం పొందారు. ఇదే క్రమంలో రన్నింగ్ పోటీల్లో రాజేష్, రాహుల్ గెలుపొందగా, బాలికల విభాగంలో దస్తమ్మ (గుండుమాల్), సింధూ (గుండుమాల్) విజేతలుగా నిలిచారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

అమ్మవారికి బంగారు వితరణ

మక్తల్: పట్టణంలోని నల్లజానమ్మ అమ్మవారికి మక్తల్‌చెందిన న్యాయవాది తిమ్మన్న సతిమణీ లెక్చరర్ విజయలక్ష్మి కలిసి శుక్రవారం ఆలయంలో తులంబంగారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం ఆలయంలో పూజ లు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బంగారం విలువ రూ. 63వేల ఉందని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు తిమ్మన్నదంపతులను శాలువాతో సన్మానం చేశారు.